దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా..


ఇళ్ల మధ్య నిల్వ ఉన్న వర్షపు నీరు


పేరుకుపోయిన మురుగు

- శ్రామికనగర్‌లో దుస్థితి
- చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- రోగాల బారినపడుతున్న స్థానికులు

నెల్లూరు సిటీ: చిన్నపాటి వర్షానికే ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. స్థల యజమానులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి తలెత్తుతోంది. మరోవైపు నిల్వ ఉన్న నీరు దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా మారుతున్నాయి. పేరుకుపోయిన నీటిలో మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికుల అవస్థలు వర్ణనాతీతమవుతున్నాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్లో గల శ్రామికనగర్‌లో ఈ సమస్య ఏర్పడింది. ఇక్కడ దాదాపు 2500 మంది నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఖాళీ స్థలాలపై యజమానుల పర్యవేక్షణ కొరవడటంతో పిచ్చిచెట్లు ఏపుగా పెరిగాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు నీరు చేరి కాలువలను తలపిస్తున్నాయి. పురుగులు, పాములు ఇళ్లలోకి ప్రవేశిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలను పట్టించుకునేవారేరీ..?

వాస్తవానికి ఖాళీ స్థలాలను ఆయా యజమానులు పర్యవేక్షించాలి. పిచ్చిచెట్లు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉంది. దీనికి సంబంధించి నోటీసులను జారీ చేశామని కార్పొరేషన్ అధికారులు చెప్తున్నా, అది వాస్తవ విరుద్ధంగా ఉంది. మరోవైపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు

పొదలకూరు : పాఠశాల, కళాశాలల ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లను అందజేస్తున్నట్లు తహసీల్దార్ శివకృష్ణ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ విద్యార్థులు సంబంధిత సచివాలయాల్లో ఇన్‌కమ్, ఈడబ్ల్యూఎస్, క్యాస్ట్, నేటివిటీ సర్టిఫికెట్లను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను అందుబాటులో లేకపోయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

మాయమాటలు చెప్పి నగదు స్వాహా

ఉదయగిరి: 'ఓ పెద్దాయనా.. రోడ్డుపై డబ్బులు పడి ఉన్నాయి.. నీవేనా.. నావి కాదయ్యా.. అయినా ఓసారి జేబు చూసుకో..' అనగానే వెంటనే ఆ పెద్దాయన తన జేబులో ఉన్న డబ్బులు చేతిలోకి తీసుకొని నా డబ్బులు నా దగ్గరే ఉన్నాయి.. అనగానే ఓ వ్యక్తి అవి లాక్కొని ఉడాయించిన ఘటన ఆదివారం దాసరపల్లి–ఉదయగిరి గ్రామం మధ్య 167వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. దాసరపల్లికి చెందిన దివ్యాంగుడైన సయ్యద్ అమీరుల్లా గ్రామంలో చిన్నపాటి దుకాణం నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సరుకుల కోసమని తన మూడు చక్రాల వాహనంపై ఉదయగిరికి వస్తున్నాడు. ఈ నేపథ్యంలో వెనుక వైపు బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి రోడ్డుపై డబ్బులు పడి ఉన్నాయి.. అవి నీవేనా అంటూ బండి ఆపాడు. లేదయ్యా.. నావి కాదన్నాడు ఆ పెద్దాయన. అయినా ఒకసారి జేబు చూసుకోమనగా వెంటనే అమీరుల్లా తన జేబులో ఉన్న రూ.8 వేల నగదు చేతిలోకి తీసుకోగా ఆ వ్యక్తి డబ్బులు లాక్కొని అక్కడి నుంచి ఉడాయించాడు. మోసపోయానని తెలుసుకున్న అమీరుల్లా వెంటనే పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి నిందితుడి కోసం గాలిస్తున్నారు. పెట్రోలు బంకు వద్ద సీసీ కెమెరాలు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

వావిలేరులో ఉచిత వైద్యశిబిరం

చేజర్ల: మండలంలోని వావిలేరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 120 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రాంబాబు, వైద్యులు సుబ్రహ్మణ్యం, రమేష్, పెంచలయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్లు

వరికుంటపాడు: మండలంలోని విరువూరులో ఆదివారం భక్తులు గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్లు పొంగించారు. మారుతీనగర్‌కు చెందిన మహిళలు రామాలయం వద్ద నుంచి పొంగళ్ల సామగ్రిని కొత్త బుట్టల్లో పెట్టుకొని గ్రామోత్సవంగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా అచ్చమాంబ తిరునాళ్ల



మర్రిపాడు: మండలంలోని పొంగూరు కండ్రిక సమీపంలో ఉన్న అచ్చమాంబ పేరంటాలు ఆలయంలో అమ్మవారి తిరునాళ్ల ఆదివారంతో ముగిశాయి. శనివారం రాత్రి అచ్చమాంబ – వెంగమనాయుడు దంపతులను విశేషంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా పండరి భజన, చెక్క భజన, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఊరేగింపు నిర్వహించగా, భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం నిర్వహించిన బండ లాగుడు పోటీల్లో వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎడ్లు విజేతలుగా నిలిచాయి. వైఎస్సార్ జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన సూరారెడ్డి ఎడ్లు విజేతగా నిలవగా పొంగూరు సర్పంచ్ ఉర్లగంటి శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మోదేపల్లి అచ్చయ్యనాయుడు, సీఐ వేణు, ఎస్సై విశ్వనాథరెడ్డి విజేతలకు రూ.35 వేలు నగదు బహుమతి అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన అదే జిల్లాకు చెందిన ఎడ్ల యజమానికి రూ.25 వేల నగదు బహుమతి అందజేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం

ఉదయగిరి: ఉదయగిరి పట్టణానికి చెందిన దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ ముజీర్‌అహ్మద్ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో ఆదివారం స్థానిక షాదీమంజిల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్‌వలి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు షేక్ ముజీర్‌అహ్మద్ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓలు పి.మోహనరావు, అల్లాభక్షు, జి.ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న వెంకట్రామరాజు

నెల్లూరు(బారకాసు): బ్రాహ్మణుల అభివృద్ధికి సంఘాలు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామరాజు పేర్కొన్నారు. బ్రాహ్మణ సేవా సంఘాల సమితి నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డీఎస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పేద బ్రాహ్మణుల అభివృద్ధి కోసం సమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామని వివరించారు. జిల్లా అధ్యక్షుడిగా గుడ్లదొన వాసుదేవరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కురుచేటి లక్ష్మీనారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, కోశాధికారిగా దుద్దుకూరు రమేష్, జిల్లా న్యాయసలహాదారుడిగా ప్రసాద్, మహిళా విభాగ అధ్యక్షురాలిగా జయలక్ష్మి, కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా గడ్డం జయలక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రణీత్ గ్రూప్ చైర్మన్ ప్రణీత్ నరేంద్ర, ఆర్డీఓ మలోల, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో వైద్య శిబిరం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వైద్య శిబిరాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. 300 మందికి వైద్య పరీక్షలను డాక్టర్లు శ్రీధర్‌రెడ్డి, సత్యనాథ్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరామారావు, కార్యదర్శి వెంకటసురేంద్రబాబు, కోశాధికారి సాయిరామ్, మాజీ అధ్యక్షుడు శేషగిరిరావు, గౌరవాధ్యక్షుడు తిరుపతినాయుడు, రఘురామ్ ముదిరాజ్, రఘురామనాయుడు, సోంపల్లి రఘురామనాయుడు, మాలకొండయ్య, బాబూరావు, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్సు అందజేత



నెల్లూరు(అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శీతల శవపేటిక ప్రాజెక్ట్‌కు రూ.లక్ష విలువ గల ఫ్రీజర్ బాక్సును విరాళంగా ఆదివారం అందజేశారు. ముత్తుకూరు రోడ్డులోని వైవీ లయన్స్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ చలువాది వివేకానంద తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భార్య శిరీషతో కలిసి దీన్ని అందించారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖ కార్యదర్శి, మోర్గ్ ప్రాజెక్ట్ కన్వీనర్ సాయిరామ్, రెడ్‌క్రాస్ తలసేమియా ప్రాజెక్ట్ కో కన్వీనర్ పర్వీన్, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ రంజని తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు(బారకాసు): వనంతోపు సమీపంలోని జనహిత వాత్సల్య ఆశ్రమానికి నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడారు. నిమ్మకంటి గౌతమ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మానవసేవే మాధవసేవ టీం నిర్వాహకులు పరిమళ, ప్రఫుల్ల, నారాయణరాజు, విజయమ్మ, సురేష్ ఆధ్వర్యంలో వీటిని అందజేశారని చెప్పారు. ఆశ్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం



నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలోని ఏపీఆర్‌ఎస్‌ఏ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పెంచలరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిన గత కలెక్టర్ హరినారాయణన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సుధాకర్ ప్రసాద్ వర్ధంతిని సెప్టెంబర్ 27న జరపాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించారు. జిల్లా కార్యదర్శి డానియెల్ పీటర్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ మురళి, కోశాధికారి సతీష్, స్వప్న, బాలకోటమ్మ, శేషయ్య ప్రదీప్, అనిల్‌కుమార్ యాదవ్, కృష్ణప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం



నెల్లూరు సిటీ: నగరంలోని జీజీహెచ్‌లో మహిళకు రక్తం అవసరం కావడంతో పలువురు రక్తదానం చేశారు. లైవ్‌లో రెండు.. ప్రైవేట్ ఆస్పత్రిలో మరో రెండు యూనిట్లను సేకరించి అందజేశామని పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ అధ్యక్షుడు ముని వెంకటసూర్య పేర్కొన్నారు. ఇండ్లచెరువు వెంకటేష్, సమీర్, కిరణ్‌కుమార్, నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక అండ.. కంది సాగు

- అంతర పంటగా వేస్తే మేలు

పొదలకూరు : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కందిపంట సాగుకు అనుకూలంగా ఉంటుందని ఏఓ ఎ.వాసు రైతులకు సూచించారు. దీనివల్ల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు. పొదలకూరు ప్రాంతంలో తరచూ కురుస్తున్న వర్షం వల్ల నేలలో తేమ శాతం ఉన్నందున ఖరీఫ్‌లో కంది సాగు చేపట్టవచ్చునన్నారు. మండలంలో మెట్టపొలాలు అధికంగా ఉన్నందున కందితో పాటు రబీ సీజన్‌లో మినుము, పచ్చిశనగ, పెసర పంటలను సాగు చేస్తుంటారు. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కంది అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారి వెల్లడించారు.

విత్తనాలు నాటే విధానం

కంది సాగు చేసే రైతులు వరుస, వరుసకు నాలుగు మీటర్ల ఎడమ ఉండేలా విత్తనాలను నాటుకోవాలి. ఇందువల్ల అక్టోబర్, నవంబర్ మాసాల్లో కురిసే వర్షాలకు కంది సాళ్ల మధ్య మినుము, పెసర, పచ్చిశనగ పంటలను సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. కందిని ఏక పంటగా కూడా విత్తుకోవచ్చు. వరుస, వరుసకు మధ్య రెండు మీటర్ల గ్యాప్ ఉండేలా చూసుకోవాలి.

కందిని అంతరపంటగా వేయాలి

పెసర, మినుము, పచ్చిశనగ పంటల్లో అంతర పంటగా కంది సాగు చేపడితే అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతిన్నా కంది చేతికి అందుతుందని, రైతులు నష్టాలను పూడ్చుకునేందుకు అవకాశం ఉంటుందని ఏఓ తెలిపారు. ఒకే పొలంలో ఖరీఫ్‌లో కంది, రబీలో పెసర, మినుము పంటల సాగు చేసుకునేందుకు వీలు ఉంటుందన్నారు. రైతుకు ఒక ఎకరాపై నికర ఆదాయం పెరుగుతుంది. తక్కువ సారవంతమైన భూముల్లో కూడా కంది సాగు చేసుకునేందుకు వీలు ఉంటుంది. కంది పంటలో కలుపు నివారణ పనులు కూడా సులభతరంగా ఉంటుంది. ఈ సాగు కింద ఎకరాకు మూడు కిలోలు విత్తుకోవాల్సి ఉంటుంది. రెండు వరుసల మధ్య కల్టివేటర్, గుంటక తోలి కలుపును నివారించవచ్చు. కంది మొలిచిన నెల తరువాత కలుపు మొలిచిన 20 రోజుల్లో ఇమాజితాఫెర్ పది శాతాన్ని ఎకరాకు రెండు వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మనుబోలమ్మకు ప్రత్యేక పూజలు



మనుబోలు : మనుబోలు పెద్ద చెరువు గట్టున వెలసిన గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఏడాదంతా వర్షాలు బాగా కురిసి పాడి పంటలతో కళకళలాడాలని కోరుకుంటూ అమ్మవార్లకు చలిపిండి, పానకాలు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు ఫణీంద్రశర్మ గ్రామదేవతలకు ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అర్జీలను నేడు సమర్పించొచ్చు

నెల్లూరు(బారకాసు): వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను సోమవారం స్వీకరించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన సమావేశ మందిరంలో ఉదయం పది నుంచి అర్జీలను అందజేయాలని కోరారు.

బుచ్చిలో పశుగ్రాస వారోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని పశువైద్యశాలలో పశుసంవర్ధకశాఖ ఏడీ ప్రసన్నాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సబ్సిడీ ద్వారా దాణా, గడ్డి, విత్తనాల సరఫరా ఏ విధంగా లభిస్తాయో పాడి రైతులకు వివరించారు. ప్రభుత్వం ద్వారా అందే సబ్సిడీ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించా రు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.రమేష్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐవైఎం పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బారకాసు): ఆదర్శ యువత.. ఆదర్శ సమాజం అనే నినాదంతో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త ఉద్యమ పోస్టర్లను నగరంలోని ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కరిముల్లా మాట్లాడారు. ఆదర్శ యువతతో ఆదర్శ సమాజం సాధ్యమవుతుందని చెప్పారు. పది రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమానికి యువకులు భారీగా హాజరుకావాలని కోరారు. ఐవైఎం జిల్లా అధ్యక్షుడు సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

జక్కా వెంకయ్య భవన్ ప్రారంభం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్న నేత జక్కా వెంకయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని 17వ డివిజన్లో నిర్మించిన జక్కా వెంకయ్య భవనాన్ని ఆదివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అర్పించిన గొప్ప వ్యక్తి వెంకయ్య అని కొనియాడారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారమే లక్ష్యంగా భవనాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నేతలు మాదాల వెంకటేశ్వర్లు, కట్టా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాబూ జగ్జీవన్‌రామ్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని సీనియర్ నేతలు గంపల నాగేశ్వరరావు, ఏలియా మాదిగ, శరత్ మాదిగ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మార్పీఎస్ నేత మందా పెంచలయ్య మాట్లాడారు. మాదిగల కోసమే కాకుండా పలు సమస్యలపై ఉద్యమాలను చేపట్టామని వివరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగకు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. నేతలు వెంకయ్య, ప్రసాద్, రఫీ, కిరణ్, కరుణ, నరేంద్ర, మస్తానయ్య, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(పొగతోట): పంచాయతీరాజ్ శాఖలో ఆత్మకూరు ఏఈగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉమామహేశ్వరరావును ఆదివారం సత్కరించారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ చిరంజీవి హాజరయ్యారు.

ఘనంగా ఇంగ్లిష్ ఆరాధన వార్షికోత్సవం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ది ఛాంబర్స్ మెమోరియల్ డొనీహాల్ ఇంగ్లిష్ వర్షిప్ సర్వీస్ 180వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీఆర్సీ సెంటర్‌లోని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్లో కార్యక్రమాలను డాక్టర్ వైటీ మిత్ర నేతృత్వంలో ఇంగ్లిష్ సర్వీస్ చాప్లిన్ రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్ అధ్యక్షతన జరిపారు. హైదరాబాద్ స్వాంతన సేవా సమితి డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ మృత్యుంజయ వాక్యోపదేశం చేశారు. ఇంగ్లిష్ ఆరాధన పరంపరను రెవరెండ్లు శ్యామ్‌సన్‌కుమార్, డేవిడ్ దయాసాగర్, సాల్మాన్, కోటేశ్వరరావు, శ్రీధర్, డాక్టర్ నిర్మల్ కుమార్, హరిపాల్ వివరించారు. వైటీ మిత్ర, డేవిడ్ లివింగ్‌స్టన్, మృత్యుంజయతో పాటు వివిధ చర్చిల పాస్టర్లను సత్కరించారు. క్వయిర్ ఆలపించిన ప్రత్యేక గీతాలు అలరించాయి. అసోసియేట్ చాప్లిన్ డాక్టర్ రాజకుమారి, సెక్రటరీ శరత్ స్టీవెన్సన్, బర్సర్ ప్రేమలివింగ్‌స్టన్, క్వయిర్ డైరెక్టర్ శారా ప్రవీణ, కృపారాజన్, సునీల్, జానీజో, విజయపాల్, సైమన్ మోసెస్ తదితరులు పాల్గొన్నారు.